ఆంధ్రజ్యోతి

**** ఇఫ్తార్ : 6.31 | సహర్ : 5.03 (శుక్రవారం)

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 13 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 20.2



మండుతున్న ఎండలు

- అనూహ్యంగా పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- జిల్లాలో గరిష్ఠంగా 39 డిగ్రీల నమోదు
- నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో 40.3
- పేట జిల్లా మద్దిరాలలో 39.6 డిగ్రీలు

యాదాద్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. ఈసారి ఎండలు ఠారెత్తనున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ విపరీతంగా ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఎండలు మార్చి రెండోవారం నుంచి ప్రారంభమవుతాయి. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ముందస్తుగానే ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నంవేళ ఎండవేడికి జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మార్చిలోనే ఈవిధంగా ఎండలు మిగతా 6వ పేజీలో...

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
6	35.6	28.0
7	37.5	25.3
8	39.1	26.8
9	36.3	25.9
10	36.0	26.5
11	35.9	26.8
12	38.7	31.0

నిధులు లేక నిలిచిన పనులు

గ్రామపంచాయతీల్లో నిధుల లేమితో పనులు ముందుకు సాగడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సరఫరా కోసం చేపట్టాల్సిన ప్రత్యేక పనులకూ ఆటంకం కలిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన నాటినుంచి పంచాయతీల్లో పాలన కుంటుపడింది. పనులన్నీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులే వీడీసీల ద్వారా చేపట్టాల్సి రావడంతో చేసిన పనులకు బిల్లులు పెండింగ్ ఉండటంతో మిగతా పనులు చేయలేని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 1,740 పంచాయతీల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉండగా, వేసవి ఎలా గడుస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో మంత్రులు సమావేశం నిర్వహించి నిధుల విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకునేందుకు నిధులు విడుదల చేస్తామని, కలెక్టర్ల వద్ద అవసరమైన నిధులు ఉంచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని మంత్రులు హామీ ఇవ్వడం గ్రామాల్లో నెలకొన్న పరిస్థితిని తెలియజేస్తోంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- పెండింగ్ బిల్లులతో గ్రామాల్లో పనులు చేయించలేని దుస్థితి
- చేతులెత్తేసిన కార్యదర్శులు
- మంత్రులకూ వినతిపత్రాలు ఇచ్చిన వైనం
- ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.45కోట్ల బిల్లులు పెండింగ్
- అత్యవసర పనులకు కలెక్టర్ల వద్ద నిధులు ఉంచాలనే సూచనలు



వేసవి కారణంగా గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడటంతో నల్లగొండ మండలం కంచనపల్లిలో కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)ల ద్వారా అత్యవసర పనులను కార్యదర్శులు చేయించారు. ప్రధానంగా తాగునీటి మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్లు, వీధి దీపాల ఏర్పాటు, బ్లీచింగ్, శానిటేషన్ సామగ్రి, ఫాగింగ్ లిక్విడ్ కొనుగోలుతోపాటు, ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా బాధ్యత వారిపైనే పడింది. ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చిన 14 నెలల నుంచి కార్యదర్శులే ఈ పనులు చేయిస్తున్నారు. అందుకు సంబంధించిన బిల్లులను జూలై వరకు చెల్లించిన ప్రభుత్వం ఆగస్టు నుంచి చెల్లింపులను పెండింగ్‌లో పెట్టింది. ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులకు వడ్డీల భారంతోపాటు, వీడీసీలు సైతం పనులు చేయకుండా పాత బిల్లుల కోసం ఒత్తిడి తెస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో సుమారు రూ.21.20కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.15.60కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.9కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. ఈ బిల్లులు ఇప్పించకపోతే పనులు చేయించలేమని, తక్షణం వాటిని మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రికి, ఎమ్మెల్యేలకు పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు, టీఎన్‌జీవో నాయకులు వినతిపత్రాలు అందజేశారు. బిల్లులు వస్తేనే వేసవిలో పనులు చేయించగలమని, లేదంటే ఇబ్బందులు తప్పవని వారు చెబుతున్నారు. గ్రాంట్లు రాకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని, ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ల వద్ద ప్రత్యేక నిధులు!

గ్రామ పంచాయతీలతోపాటు మునిసిపాలిటీలకు సైతం పాలకవర్గాలు లేవు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండాలంటే మిగతా 6వ పేజీలో...

ఆయకట్టు చివరి భూములకు సాగునీరందాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, కనగల్, పెద్దవూర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు ఎండిపోకుండా ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని, దీనికి రైతులు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం గుర్రంపోడు, కనగల్ మండలాల పరిధిలోని డీ-25, డీ-8, 9 కాల్వలను కలెక్టర్ తనిఖీ చేశారు. కాల్వ కింద చివరి భూమి వరకు సాగునీరు అందుతుందా? లేదా? అని పరిశీలించారు. గుర్రంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద, మారేపల్లి వరకు కాల్వను పరిశీలించి ఆమె మాట్లాడారు. రైతులు కాల్వలకు గండ్లు కొట్టడం, నీరు మళ్లించుకోవడం వంటి చేయవద్దన్నారు. వారి పరిధిలో ఉన్న ఫీడర్ ఛానళ్లు, సబ్ మైనర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే సాగునీరు సులభంగా వస్తుందని, అలాగే వచ్చే సీజన్‌కు నీరు సులభతరంగా అందుతుందన్నారు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎక్కువ నీటిని విడుదల చేసినందున రాత్రిలోపు కాల్వ చివరి వరకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. నీటిని రైతులు జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. కాల్వల్లో వచ్చే నీరు ఆయకట్టు చివరి భూముల వరకు అందేలా ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారులు సైతం బాధ్యత తీసుకోవాలన్నారు. కాల్వలకు గండ్లు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, ఈఈ నెహ్రూనాయక్, ఉన్నారు.



పెద్దవూర మండలంలో డీ-8, 9 కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి(సాగర్)): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని రంగుండ్ల తండాను సందర్శించి ధర్తీ ఆబా జన్‌జాతీయ్ ఉత్కర్ష్ అభియాన్‌కు సంబంధించి గ్రామంలో చేపట్టిన మౌలిక వసతులను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, పథకం గురించి అవగాహన కల్పించారు. తండాలో జల్ జీవన్‌లో భాగంగా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా వాన నీటిని సంరక్షించే కట్టడాలు, సోలార్ లైట్లు, 10హెచ్‌పీ సోలార్ పంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ భవనం, గ్రంథాలయం, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఎంఎస్ఎంఈ కింద మిర్చి పంటకు సంబంధించిన ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా చేపలు పెంచేందుకు ఒక ఎకరం స్థలంలో నమూనా బ్లాక్‌ను ఏర్పాటు చేస్తామని, ఉద్యాన పంటలకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

గత ఏడాది నవంబరు 15న ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించారని, జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా రంగుండ్లతండాను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆమె వెంట జిల్లా ఇన్‌చార్జి గిరిజన అభివృద్ధి అధికారి, గృహ నిర్మాణశాఖ అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీవో మల్లీశ్వర్, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగమణి, ఎస్ఐ వీరశేఖర్, ఆర్ఐ లక్ష్మీకాంత్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోతు పాండు, బాలునాయక్, హరినాయక్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పన

మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ రాష్ట్ర డైరెక్టర్ శివరాంప్రసాద్



వైద్య సేవల గురించి అడిగి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శివరాం ప్రసాద్

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ రాష్ట్ర డైరెక్టర్ శివరాంప్రసాద్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఐసీయూ, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, మాతశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ, ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని, త్వరలోనే పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామన్నారు. మందుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, రోగులందరికీ వైద్యం అందించేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతామన్నారు. నెల రోజుల్లోపు కౌన్సిలింగ్ నిర్వహించి వైద్య పోస్టులు భర్తీ చేస్తామన్నారు. పెరిగిన పడకల సామర్థ్యానికి అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను నియమించేందుకు అనుమతించామన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ అరుణకుమారి ఉన్నారు.

ఆస్పత్రిలో డిప్యుటేషన్లు రద్దు : కలెక్టర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిప్యుటేషన్ రద్దుతో పాటు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అవుట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంఈకి వివరించారు. ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వైద్య కళాశాలలో సిబ్బందిని పెంచేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వీటి భర్తీకి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, ఉన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తి



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- నేటి నుంచి క్రీడా పోటీలు
- ప్రారంభించనున్న కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటూ, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆటవిడుపు కల్పించేందుకు జిల్లా పోలీస్‌శాఖ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించేందుకు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నిర్ణయించగా, అందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది డివిజన్ల వారీగా ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్‌తో పాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి రిహార్సల్స్ కూడా పూర్తయ్యాయి. 13న ఉదయం పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభించనున్నారు. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్‌తో పాటు ఏఆర్ కానిస్టేబుళ్ల జట్టు కూడా పాల్గొననున్నాయి.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య



రేషన్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఓఎస్డీ అంజయ్య

మర్రిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తే డీలర్లకు కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేషన్ దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. బియ్యం పంపిణీ విషయంలో ఇబ్బందులకు గురి చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్, డీఎస్టీ యాదయ్య, తహసీల్దార్ కమాల్‌పాషా, తదితరులు ఉన్నారు.

పథకాల్లో లబ్ధిచేకూరేలా చూడాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నాగార్జునసాగర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మానవతా దృక్పథంతో వివిధ పథకాల్లో లబ్ధి చేకూరేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన సాగర్ సందర్శనలో భాగంగా పైలాన్ కాలనీలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలను, ప్రధాన డ్యాంను తిలకించారు. ఈ సందర్భంగా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో నీటిపారుదల శాఖ, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇంజనీరు కోటేశ్వర్‌రావు, జిల్లా ఎస్సీ శాఖ అధికారి వెంకట కృష్ణ, జయపాల్, నీటిపారుదల శాఖ, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులు, పాల్గొన్నారు.

బుద్ధవనం అద్భుతం..

ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం అద్భుతంగా ఉందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రాత్రి బస సాగర్ విజయవిహార్ అతిథి గృహంలో చేశారు. బుధవారం సాగర్ సందర్శనలో భాగంగా జలాశయంలో పర్యాటక శాఖ లాంచీలో జాలీ ట్రిప్పులో తిరిగారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలను తిలకించారు. ఆ తర్వాత బుద్ధవనానికి చేరుకున్న ఆయనకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ రవిచంద్ర స్వాగతం పలికారు. బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత బుద్ధవనంలో చరిత వనం, స్తూప వనం, జాతక వనం, ధ్యాన వనాలను తిలకించారు మహాస్తూపంలో కాసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బుద్ధవనాన్ని సందర్శించాలన్నారు. బుద్ధవనంలో బుద్ధుని జీవితాన్ని కళ్లకు కట్టినట్లు బొమ్మల రూపంలో చక్కగా తీర్చిదిద్దారన్నారు. బుద్ధుని జీవితం సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా అద్భుతంగా శిల్పాలను మలిచారన్నారు. బుద్ధవనం, సాగర్ డ్యాం, విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, నల్గొండ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ పిడి కోటేశ్వర్‌రావు, ఎస్ఐ సంపత్, ప్రోటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద అంజలి ఘటిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

కొండమల్లేపల్లి : ఎస్సీ, ఎసీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు జిల్ల శంకర్, నీలా దేవి, లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్‌లు బుధవారం నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలంలోని గుడితండాలో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపుతో గుడితండా పూర్తిగా ముంపునకు గురవుతోందని, తండావాసులందరికి అన్ని వసతులతో కూడిన పునరావాసం కల్పించాలని పలువురు తండావాసులు కమిషన్ సభ్యులకు విన్నవించుకున్నారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులను తండావాసులు సన్మానించారు. కార్యక్రమంలో తండావాసులు శంకర్‌నాయక్, సక్రు, హనుమ, చిట్టిబాబు తదితరులున్నారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

ఏబీవీపీ ఎంజీయూ అధ్యక్షుడు రాగిఫణి హనుమాన్

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఎంజీయు ఏబీవీపీ అధ్యక్షుడు రాగిఫణి హనుమాన్ కోరారు. బుధవారం నాడు యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. విశ్వ విద్యాలయాల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకవస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగం కోసం కృషి చేస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. గత సంవత్సర బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులే కేటాయించిందని వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో సైతం చిన్న రాష్ట్రాలు అయినప్పటికీ 12 నుంచి 13శాతం కేటాయిస్తుంటే తెలంగాణలో మాత్రం అరకొరగా నిధులు కేటాయిస్తోందన్నారు. రాష్ట్రంలోని 11విశ్వవిద్యాలయాల్లో గతంలో 2,878 టీచర్ పోస్టులు మంజూరైతే ప్రస్తుతం కేవలం 753మాత్రమే పనిచేస్తున్నారని, 70శాతం ఖాళీలతో కాలం వెలదీస్తున్నారన్నారు. విలేకర్ల సమావేశంలో యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు మౌనేష్, రాజేష్, వెంకటేష్, విజయ్, తరుణ్, ప్రదీప్, సైదులు, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగిఫణి హనుమాన్

ఇంటర్ పరీక్షలకు 368మంది గైర్హాజరు

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు మొత్తం 13,511మంది విద్యార్థులకు గాను 13,143హాజరు కాగా 368మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,395మందికి గాను 11,120మంది హాజరు కాగా, 275మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,116మందికి గాను 2,023మంది హాజరు కాగా 93మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఏలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ బస్సులను, అద్దె బస్సు సిబ్బందిని ఆర్టీసీలో విలీనం చేయాలని లేనట్లయితే సమ్మెకు సిద్ధమవుతామని జేఏసీ చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదూరు వెంకన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని విలీనం చేయాలని అనేక సార్లు పోరాటం చేసిన కూడా స్పందించక పోవడంతో సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. ఈనెల 17న యాజమాన్యంతో కార్మిక సంఘాల చర్చలు జరపడానికి మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చింత వెంకన్న, థామస్‌రెడ్డి, పల్లా దేవేందర్ రెడ్డి, కేఎస్ పాల్, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, పీఎంరావు, అప్పారావు, వెంకటయ్య, నరేందర్, యాదయ్య, పుల్లయ్య, ఎస్ఆర్‌సీ రాజు, ఎస్ఎస్ గౌడ్, జమాల్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశ జనాభాలో సగ భాగమున్న యువతను అభివృద్ధిలో భాగస్వాములు చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన వేదికే వికసిత్ భారత్. స్వయం స్వావలంబన దిశగా వెళ్తున్న భారతదేశం మరింత అభివృద్ధి చేసేందుకు నిర్మాణాత్మకమైన నిర్ణయాలు అవసరం. అందుకు యువత సలహాలు, సూచనలు తీసుకోవాలని సంకల్పించింది కేంద్ర యువజన, క్రీడల శాఖ. అందులో భాగంగా మూడేళ్లుగా యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది సైతం ఆసక్తి ఉన్న యువకుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది.

ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్

వికసిత్ భారతం.. యువ సందేశం



● యువతకు చక్కటి అవకాశం

యూత్ పార్లమెంట్‌లో పాల్గొనేందుకు యువతకు చక్కటి అవకాశం కల్పించారు. 18 నుంచి 25 సంవత్సరాల లోపు (ఫిబ్రవరి 2025 నాటికి) వయసున్న యువతకు యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశముంది. అయితే వికసిత్ భారత్ పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్నట్లు గుర్తింపు ఉన్న ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో మూడు దశలు దాటిన అభిప్రాయాలను కేంద్ర యువజన, క్రీడాశాఖకు పంపిస్తారు. తుది దశలో ఎంపికైన యువకులతో నోడల్ కేంద్రం లోని మూడు జిల్లాల నుంచి 150 అభిప్రాయాలను (ఒక్కో జిల్లా నుంచి 50) ఎంపిక చేసి అందులో ఉత్తమమైన 10అభిప్రాయాలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై..



నోడల్ కేంద్రంగా ఎంపికైన నల్లగొండ ఎన్జీ కళాశాల

విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ నోడల్ కళాశాలను ఏర్పాటు చేసింది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్ జిల్లాలను కలిపి జిల్లాకేంద్రంలోని ఎన్‌జీ ప్రభుత్వ కళాశాలను నోడల్ కేంద్రంగా ఏర్పాటు చేసింది. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, పీజీ కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థులు 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంశంపై సందేశాలను పంపాల్సి ఉంటుంది. వాటిలో ఉత్తమమైన వీడియోలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతారు. అక్కడ ఎంపికైన విద్యార్థులు 'భారత రాజ్యాంగం-75 ఏళ్ల, హక్కులు, విధులు, పురోగతి' అనే అంశాలపై మరో (పోటీ)వీడియో సందేశం చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ఉత్తమ సందేశాలను ఎంపిక చేసి జాతీయస్థాయికి పంపుతారు. అక్కడకు ఎంపికైన యువకులు 'వన్ నేషన్-వన్ ఎలక్షన్, సింప్లిఫైయింగ్ డెమొక్రసీ, ఆంప్లిఫైయింగ్ ప్రోగ్రెస్, ఎన్సూరింగ్ స్టెబిలిటీ' అనే అంశాలపై వీడియో రూపొందించాల్సి ఉంటుంది.



● వందేళ్ల స్వాతంత్ర్య భారత్ కోసం..



దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి నూరేళ్లు నిండనుండగా.. అప్పటికి దేశం అన్ని రంగాల్లో ముందుండాలంటే ఎలాంటి పాలన అవరం, ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలనే అంశాలపై యువత తమ అభిప్రాయాలను పంపాల్సి ఉంటుంది. యువత తాము ఎంచుకున్న అంశంపై ఒక నిమిషం నిడివి గల వీడియో సందేశాన్ని 'మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. జాతీయ స్థాయి పోటీ కాబట్టి యువత తమకు వచ్చిన, నచ్చిన భాషలో సందేశ వీడియోను పంపొచ్చు.

విద్యార్థులు ముందుకు రావాలి



యువత దేశానికి వెన్నుముక లాంటి వారు. వారి కోసమే యూత్ పార్లమెంట్ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యు లు చేసేందుకు కల్పించిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. చక్కటి సందేశాన్నిచ్చే వీడియోలు తీసి యూత్ పార్లమెంట్ పోటీలో పాల్గొనేందుకు ముందుకు రావాలి.

- డాక్టర్ సముద్రాల ఉపేందర్, వికసిత్ భారత్ ప్రోగ్రాం చైర్మన్

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునేందుకు చక్కటి అవకాశమే యూత్ పార్లమెంట్ కార్యక్రమం. కేంద్ర యువజన, క్రీడల శాఖ నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్యార్థులు ముందుకు రావాలి. అభివృద్ధి, రాజ్యాంగ అమలు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై తమ ఆలోచనలకు రూపం కట్టి చక్కటి సందేశంతో కూడిన వీడియోలు రూపొందించి పోటీలో పాల్గొనాలి.

● డాక్టర్ పి. మద్దిలేటి (ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్, ఎంజీయూ)



● వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ... అంశంపై

దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములను చేసేందుకు వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ.. అంశంపై అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 27న ప్రారంభమైన పోటీ ఈ నెల 16న ముగియనున్నట్లు కేంద్ర యువజన శాఖ పేర్కొంది. యువత జిల్లా స్థాయిలో తాము రూపొందించిన వీడియోను ఈ నెల 16వ తేదీ లోగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో వచ్చిన అభిప్రాయాల వీడియోలను ఈ నెల 19, 20వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల (నోడల్ కేంద్రం)లో పరిశీలించి ఉత్తమమైనవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రంలోని ఇతర నోడల్ కేంద్రాల నుంచి వచ్చిన వాటన్నింటినీ కలిపి 26వ తేదీన పరిశీలించి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



జగన్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లికి చెందిన అంతటి జగన్(45) గ్రామంలో తనకున్న మూడెకరాల భూమిలో వరి, పత్తి సాగు చేశాడు. ఇందుకోసం రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయంతో పాటు బోర్‌వెల్ వ్యాపారం చేస్తుండేవాడు. పంటల సాగులో దిగుబడి రాక పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లలేదు. దీనికి తోడు బోర్‌వెల్స్‌లో రూ.10లక్షల వరకు నష్టపోయాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురైన జగన్ ఈ నెల 2వ తేదీన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అదే సమయంలో సమీపంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. జగన్‌కు భార్య, కుమార్తె, కుమారుడు, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..



శ్రీను మృతదేహం

మాడ్గులపల్లి: ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినవ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిరుమర్తిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిరుమర్తి గ్రామానికి చెందిన కొండ శ్రీను(35) కొంత కాలంగా పనిచేయకుండా మద్యానికి బానిసై ఈ నెల 10న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పనులకు వెళ్లిన భార్య ఇంటికి వచ్చి చూడగా తాను ఎలుకల మందు తాగానని భార్య రాజేశ్వరికి చెప్పాడు. మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. శ్రీనుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది..



రాజు(ఫైల్)

చిట్యాలరూరల్: కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలతో ఉరేసుకుని వ్యక్తి మృతిచెందారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తికి చెందిన ఆలకుంట్ల రాజు(27) హైదరాబాద్‌లోని బోరబండ ప్రాంతంలో కూలీగా చేస్తుంటాడు. ఈ నెల 8 నుంచి 10వ తేదీల్లో గ్రామంలో తిరుమలనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగగా కార్యక్రమానికి కుటుంబసభ్యులతో హాజరయ్యాడు. కుటుంబ సమస్యలు, ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో మనస్తాపానికి గురైన రాజు మంగళవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సద్గుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుడి పేరిట పింఛన్ స్వాహా

మేళ్లచెర్వు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో కిందిస్థాయి సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సామాజిక పింఛన్ల పథకంలో లబ్ధిదారులు మృతిచెందిన వెంటనే లబ్ధిదారుల జాబితా నుంచి పేర్లు తొలగించాలి. మండలకేంద్రానికి చెందిన సోమగాని కుమార్(50) గీత కార్మికుల కోటాలో సామాజిక పింఛన్ తీసుకుంటున్నాడు. 2023 సెప్టెంబరు 9వ తేదీన అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. కుమార్ అనారోగ్యంతో ఉన్నప్పుడే తమ ఇంటి సమీపంలోనే పెన్షన్ ఇచ్చే సిబ్బంది తురక తిరుపతమ్మకు తన ఆధార్‌కార్డు, పెన్షన్ బుక్కును పంచాయతీ అధికారుల సమక్షంలో ఇచ్చాడు. అనారోగ్య కారణాల వల్ల తాను పోస్టాఫీసుకు రాలేకపోతున్నానని, తన పింఛన్‌ను ప్రతినెలా తిరుతమ్మకు ఇవ్వాలని కోరాడు. అప్పటి నుంచి తిరుపతమ్మ పింఛన్ తీసుకుంటుంది. కుమార్ డెత్ సర్టిఫికెట్‌ను 20 రోజుల క్రితం భార్య వెంకమ్మకు ఇవ్వడంతో గ్రామపంచాయతీ సిబ్బందికి అనుమానం వచ్చింది. వెంటనే వారు ఆమెను విచారించారు. విషయం వెలుగులోకి రావ డంతో తిరుపతమ్మ గ్రామం నుంచి పారిపోయింది. కుమార్ కుటుంబసభ్యులు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తిరుపతమ్మను బుధవారం పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేస్తున్నామని, పింఛన్ డబ్బులు రికవరీ చేసి విచారణ చేస్తామని ఎంపీడీవో ఖాజా అసర్‌అలీ తెలిపారు.

పశువుల కొట్టానికి నిప్పు



కాలిన పశువుల కొట్టం వద్ద రైతు శంకరయ్య

చండూరు రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలో గడ్డం శంకరయ్య అనే రైతు పొలం వద్ద బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పశువుల కొట్టానికి నిప్పంటించారు. పక్కనే ఉన్న గడ్డివాముకు మంటలు అంటుకుని పొగతో మంటలు లేవడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు వెంటనే అక్కడికి చేరుకొని కొట్టంలో ఉన్న రెండు ఎడ్లను వదిలారు. వెంటనే శంకరయ్యకు సమాచారం ఇచ్చారు. శంకరయ్య వచ్చే సరికి పశువుల కొట్టం, గడ్డివాము పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. గ్రామస్థులు, రైతుల సహాయంతో మంటలను అదుపుచేశారు. పశువులకు మేత లేకుండా పోయిం దని, కొట్టంలో ఉన్న వ్యవసాయ పనిముట్లు, ఎద్దుల బండి, ఇతర పనిముట్లు కాలిపోయాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపాడు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక, చిత్రంలో పట్టుబడిన దొంగలు

దేవరకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 70కి పైగా దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా దేవరకొండ పోలీసులు అరెస్టుచేసి వారి నుంచి 20.5 తులాల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ టోలీచౌక్‌కు చెందిన షేక్ అబ్దుల్ జాఫర్ అలియాస్ అహ్మద్, మహమ్మద్ మోసిన్ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడైన అబ్దుల్ జాఫర్ 2005 నుంచి 70కిపైగా దొంగతనాల కేసుల్లో చంచల్‌గూడ, చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించాడు. బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఫిబ్రవరి 19వ తేదీన హైదరాబాద్ నుంచి షేక్ అబ్దుల్ జాఫర్, మహమ్మద్ మోసిన్ ద్విచక్ర వాహనంపై దేవరకొండకు చేరుకున్నారు. స్థానిక మీనాక్షి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న శీల వాసు ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి తాళాలు పగులగొట్టి 20 తులాల బంగారం, రూ.10 వేల నగదును అపహరించి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితుల ఫొటోలను గుర్తించారు.

రెండోసారి చోరీకి వచ్చి పోలీసులకు చిక్కి..

దేవరకొండలో దొంగతనం చేసేందుకు ఈ నెల 11వ తేదీన వీరిద్దరూ హైదరాబాద్ నుంచి దేవరకొండకు బస్సులో వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించటంతో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి పలు అపార్ట్‌మెంట్లను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళాలు పగులగొట్టేందుకు, ఎవరైనా వస్తే దాడిచేసేందుకు ఇనుప రాడ్డును వాహనంలో ఉంచుకున్నారు. దేవరకొండలో ఈ ముఠా దొంగతనానికి పాల్పడడం మొదటిసారి అని ఏఎస్పీ తెలిపారు. ఎత్తుకెళ్లిన బంగారాన్ని హైదరాబాద్ తీగలకుంట ఓల్డ్‌సిటీకి చెందిన మహమ్మద్ ఫసీకి అప్పగిస్తారని, ఆ బంగారం విక్రయించగా ముగ్గురు కలిసి డబ్బులు పంచుకుంటారని తెలిపారు. ఈ ఘటనలో అబ్దుల్ జాఫర్, మహమ్మద్ మోసిన్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ ఫసిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దేవరకొండలో చోరీ చేసిన 14 తులాల బంగారం, కర్నూలులో చోరీ చేసిన 5 తులాలు, విశాఖపట్నంలో చోరీకి పాల్పడిన 1.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్ఐలు అజ్మీర రమేష్, నారాయణరెడ్డి, కోటేష్, కానిస్టేబుల్స్ హేమునాయక్, తిరుపతి, చాంద్‌పాషా, సతీష్, అంజి, ఎస్‌కే.ఇమ్రాన్, సోమ్లా, సింహాద్రిలను ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్ఐలు అజ్మీర రమేష్, కోటేష్ పాల్గొన్నారు.

నమ్మి చేరదీస్తే నరకం చూపించాడు

● రిటైర్డ్ ఉద్యోగికి వ్యక్తిగత సహాయకుడి హనీట్రాప్ ● మహిళతో ఉన్న అసభ్యకర ఫొటోలతో బ్లాక్ మెయిల్ ● రూ.46లక్షలు వసూలు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ఓ రిటైర్డు ఉద్యోగి హనీ ట్రాప్‌కు గురయ్యారు. వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న వ్యక్తే ఓ మహిళతో అసభ్యకరంగా ఫొటోలు తీయించి బెదిరించి ఏకంగా రూ.46లక్షలు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న వ్యక్తిగత సహాయకుడి బావమరిది సైతం బెదిరించి రూ.2.55లక్షలు వసూలుచేశాడు. ఇంకా ఇవ్వకపోతే చంపుతాననడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు బుధవారం విలేకరులకు వెల్లడించారు. అటవీ శాఖ రిటైర్డ్ ఉద్యోగి(70) భార్యతో కలిసి మిర్యాలగూడలో నివాసముంటున్నారు. కుమార్తెకు వివాహంకాగా, ఆమె భర్తతో కలిసి విదేశం(ఐర్లాండ్)లో ఉంటోంది. గతంలో త్రిపురారం మండలంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన సదరు ఉద్యోగికి తిరుమలగిరి మండలం గట్టుమీది తండాకు చెదిన అంగోతు గణేష్‌తో పరిచయమైంది. ఉద్యోగ విరమణ అనంతరం గణష్‌ను వ్యక్తిగత సహాయకుడిగా నియమించుకున్నాడు. వ్యవసాయం చేయగా వచ్చిన డబ్బులు విలాసాలకు సరిపోకపోవడంతో ఫారెస్ట్ రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని గణేష్ నిర్ణయించుకున్నాడు. రిటైర్డ్ ఉద్యోగికి సూర్యాపేట జిల్లా కేంద్రంలో మరో ఇల్లు, ప్లాటు ఉండడంతో గణేష్‌తో కలిసి అప్పుడప్పుడు సూర్యాపేటకు వస్తుండేవాడు.

మద్యం మత్తులో మహిళతో ఫొటో తీయించి..

2022 మార్చి 6వ తేదీన బాధితుడు, వ్యక్తిగత సహాయకుడు గణేష్‌లు సూర్యాపేటకు వచ్చి మద్యం తాగారు. రిటైర్డ్ ఉద్యోగి మత్తులో ఉండగా రాత్రి సమయంలో రోడ్డుపైకి వెళ్లి ఓ మహిళకు డబ్బులు ఇప్పిస్తానని తీసుకొచ్చి ఆమెను బాధిత ఉద్యోగి ఒడిలో అసభ్యకరంగా ఉంచి ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు కుటుంబసభ్యులకు చూపిస్తానని సదరు ఉద్యోగిని గణేష్ బెదిరించాడు. 2022 నుంచి 2024 వరకు దఫదఫాలుగా సుమారు 19 ప్రామిసరీ కాగితాలపై సంతకాలు చేయించుకున్నాడు. వాటిని బాధితుడి కుమార్తె, అల్లుడికి పంపి అసలు, వడ్డీ, హోంలోన్ పేరిట మొత్తం రూ.46లక్షలు వసూలు చేశాడు. విశ్రాంత ఉద్యోగిని బెదిరిస్తున్న విషయం తెలుసుకున్న గణేష్ భార్య తనకూ బంగారం ఇప్పించాలని కోరడంతో వసూలుచేసిన డబ్బుతో తన భార్యకు కొంత బంగారం కొనుగోలు చేసి ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉంచి రుణం తీసుకున్నాడు.

బెదిరింపులకు దిగిన బావమరిది

తిరుమలగిరి (సాగర్) మండలం ఎల్లాపురానికి చెందిన బావమరిది కుర్ర శంకర్‌తో కలిసి గణేష్ ఓసారి రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించాడు. ఈ క్రమంలో శంకర్ తనవద్ద కూడా వీడియోలు, ఫొటోలు ఉన్నాయని రిటైర్డు ఉద్యోగిని బెదిరించగా, పలు దఫాలుగా రూ. 2.55లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బుతో శంకర్ కారు కొనుగోలు చేశాడు. ఫిబ్రవరి నెలలో రూ.3లక్షలు ఇవ్వాలని మరోమారు శంకర్ బెదిరించడంతో విసిగిన బాధితుడు జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పి మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం పోలీసులు మిర్యాలగూడలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గణేష్, కుర్ర శంకర్‌లో కారులో పారిపోయేందుకు ప్రయత్నించటంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14లక్షల విలువైన కారు, స్మార్ట్‌ఫోన్, నాలుగున్నర తులాల బంగారం (ముథూట్ ఫైనాన్స్‌లో ఉంది) రూ.43లక్షల విలువైన 10 ఒరిజినల్ ప్రామిసరీ నోట్లు, తొమ్మిది జిరాక్స్ ప్రామిసరీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిగత సహాయకుడు గణేష్ పై రౌడీషీట్

గణేష్‌పై విజయపురి టౌన్, తిరుమలగిరి సాగర్, వాడపల్లి పోలీస్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ దొంగతనానికి సంబంధించి తొమ్మిది కేసులు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. అతని నేరప్రవృత్తిని పరిగణనలోకి తీసుకుని అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో కేసును ఛేదించిన టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐలు హరీష్‌రెడ్డి, రాంబాబు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, కళ్యాణ్, అక్బర్‌పాషా, రామకృష్ణను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

నిధులు లేక నిలిచిన పనులు

(5వ పేజీ తరువాయి)

అటు పంచాయతీల్లో, ఇటు మునిసిపాలిటీల్లో అత్యవసర పనుల నిర్వహణ లోపాలు లేకుండా చేపట్టాల్సి ఉంది. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో సైతం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇదే విషయాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు. వేసవి నీటి ఎద్దడి సమస్యల పరిష్కారానికి నల్లగొండ జిల్లా కలెక్టర్ వద్ద రూ.15కోట్లు, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల కలెక్టర్ల వద్ద రూ.5కోట్ల నిధులు ఉంచాలని సూచించారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం ప్రతీ పంచాయతీకి అత్యవసర పనుల నిమిత్తం కనీసం రూ.15వేల వరకు నిధులివ్వాలని, పనులపై యాక్షన్‌ప్లాన్ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. దీంతో తాగునీటి బోర్లు, పైప్‌లైన్లు, ఇతర మరమ్మతులకు ఎస్‌డీఎఫ్ కింద రూ.10.30కోట్ల నిధులు అవసరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రతిపాదించారు. అయితే ఈ నిధుల మంజూరుకు ప్రయత్నిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరూ కలెక్టర్ల వద్ద నిధులు ఉంచాలని ప్రతిపాదించడంతో పాటు గత వేసవిలో అద్దెబోర్లకు, ట్యాంకర్లకు ఇవ్వాల్సిన బిల్లులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయాలని కోరడంతో పాటుగా, ప్రస్తుతం అవసరమైన చోట్ల బోర్లు వేసేందుకు అనుమతించాలని, భగీరథ నీటి సరఫరాలో లోపాలు లేకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తంగా పంచాయతీల్లో తాగునీరే కాదు, వేసవి నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ సైతం జాగ్రత్తగా చేపట్టాల్సి ఉంటుందని, అందుకు అవసరమైన నిధులివ్వడంతో పాటు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్యదర్శులు, ప్రజలు కోరుతున్నారు.

అదనపు పనులకుతోడు ఆర్థిక భారం

ఓ వైపు పంచాయతీ కార్యదర్శులు అన్ని రకాల బాధ్యతలు నిర్వహిస్తుండగా, మరో వైపు పాలకవర్గాలు లేక పనుల నిర్వహణకు ఆర్థికభారం పడుతోందని వారు వాపోతున్నారు. ఆరేడు నెలలపాటు బిల్లులు రాకపోతే వడ్డీల భారం భరించాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్నామని వాపోతున్నారు. అదే సమయంలో అదనపు పనులు అప్పగిస్తే చేయలేని పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరిస్తున్నారు. ఇటీవల మంత్రులను కలిసి ఇదే విషయమై వినతి పత్రం కూడా సమర్పించామని, పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలని విన్నవించామని పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు తెలిపారు.

మండుతున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

ఉంటే.. ఇక ఎండాకాలం ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి మొదటివారంలో జిల్లాలో కనిష్ఠంగా 25 నుంచి 29 డిగ్రీలు, గరిష్ఠంగా 35 నుంచి 36 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో గతంతో పోలిస్తే కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో తీవ్రంగా మార్పులు సంభవించాయి. గత సంవత్సరం కనిష్ఠంగా 25 డిగ్రీలు నమోదైతేనే వేడి గాలులు వీచాయి. అయితే ఈసారి మాత్రం వాతావరణంలో చాలావరకు మార్పులు సంభవించాయి. ప్రస్తుతం జిల్లాలో కనిష్ఠంగా 31 డిగ్రీలు, గరిష్ఠంగా 38.7డిగ్రీలకు ఉష్ణోత్రలు చేరుకున్నాయి. బుధవారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో 40.3 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎండ ఉంటుంది. వేసవికి ముందే సూర్యుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈసారి ఏప్రిల్‌లో ఎండలు మరింతగా పెరగనున్నాయి. గతంలో లేనివిధంగా ఈసారి 44 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ శాఖ కూడా ప్రకటించింది. ప్రజలు ఇప్పుడే ఎండవేడిమిని తట్టుకోలేకపోతున్నారు. ఏప్రిల్‌లో ఎండలు మరింతగా పెరిగాయి. వారం రోజులుగా జిల్లాలో 39డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో అనూహ్యంగా పెరుగుతున్న ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఎండాకాలం వేడిమికి సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుంది. గ్రామాల్లో వ్యవసాయంతోపాటు ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వారంతా కూడా వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలతోపాటు సీజనల్ వ్యాధులూ జనంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మండుతున్న ఎండల మాదిరిగానే వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. చిన్నారులు కూడా జ్వరాలు, చికెన్‌ఫాక్స్‌వంటి రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా వేసవిలో డయేరియా (అతిసారం), గ్యాస్ట్రో ఎంట్రిసైటిస్ (నీళ్ల విరేచనాలు), చికెన్‌పాక్స్ (అమ్మతల్లి), మీజిల్స్ హీట్ పెరాక్సియా (వేడి వల్ల వచ్చే జ్వరం), హెపటైటిస్ (కామెర్లు) వంటి వ్యాధులు వ్యాపిస్తుంటాయి.

ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు

ఎండవేడిమి నుంచి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే మేలని వైద్యులు వెల్లడిస్తున్నారు. ఎండలకు చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతుంటారు. ఎండలకు శరీరంలోని నీటినిల్వలు, ఖనిజ లవణాల శాతం తగ్గి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో వడదెబ్బ బాధితులు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల పండ్లు, కాయలు, రసాలు తీసుకుంటే వేసవి తాపం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు. ఎండవేడిమిని తట్టుకోవడానికి కొబ్బరినీరు తాగడంవల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నిలువరిస్తుందన్నారు. కీరదోసకాయ వంటి అధిక నీటి శాతం ఉన్న పండ్లు, కూరగాయలు తింటే ఎంతో మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. శరీరంలో నీటి శాతం అధికంగా ఉండటంవల్ల అలసట దూరమవుతుందని వైద్యులు తెలిపారు.

ఎండల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి

ఎండలు నుంచి రక్షణ కోసం మాస్కులు, టోపీలు ధరించాలి. ఎండలు పెరిగే అవకాశముండడంతో అవసరముంటే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దు. పిల్లలు ఎండల్లో బయటకు రావద్దు. జాగ్రత్తగా ఉండాలి.

● కోటాచలం, సూర్యాపేట డీఎంహెచ్‌వో

రోజుకు అర అడుగు


నాగార్జునసాగర్ కుడికాల్వలో ప్రవహిస్తున్న నీరు

• తగ్గుతున్న నాగార్జునసాగర్ నీటి మట్టం

• కనిష్ఠ నీటి మట్టానికి 11 అడుగుల దూరం

నాగార్జునసాగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ, బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రోజుకో అర అడుగు తగ్గుతోంది. ప్రాజెక్టు కనిష్ఠ నీటి మట్టానికి 11 అడుగుల (22 టీఎంసీలు) దూరంలో ఉంది. ఈ నీటి సంవత్సరంలో (గత ఏడాది జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 31 తేదీ వరకు) సాగర్‌కు ఎగువ నుంచి 1202.96 టీఎంసీల వరకు వచ్చి చేరింది. అందులో కుడి, ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి, క్రస్ట్ గేట్ల ద్వారా మూడు నెలల పాటు (ఆగస్టు 5 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు) దిగువకు నీటిని విడుదల చేయడంతో 1147.74 టీఎంసీల నీరు సాగర్ నుంచి విడుదలైంది. ఈ నీటి సంవత్సరంలో కుడి, ఎడమ కాల్వలకు సాగు, తాగు నీటి అవసరాల కోసం గత ఆగస్టు 5వ తేదీ నుంచి నీటి విడుదల చేశారు. వానాకాలం పంటల సాగు పూర్తయినా ఆ నీటి విడుదలను అలాగే రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడి విడుదల చేసుకుంటూ ఎండాకాలం సాగుకు నేటి వరకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. దీంతో సాగర్ నీటి మట్టం రోజుకు అర అడుగు చొప్పున తగ్గుతూ వస్తోంది.

సాగర్‌లో రోజువారీ నీటిమట్టం ఇలా...

తేదీ	నీటిమట్టం
7	525.20
8	524.60
9	523.90
10	522.90
11	522.10
12	521.60

11 అడుగుల నీటిని వాడితే కనిష్ఠస్థాయికి...

మరో 11 అడుగుల నీటిని సాగర్ నుంచి వాడుకుంటే కనిష్ఠ స్థాయికి (510 అడుగులు) చేరుకుంటుంది. వేసవి ప్రారంభానికి ముందే సాగర్ నీటిమట్టం కనిష్ఠ స్థాయికి చేరుకుంటే వచ్చే నీటి సంవత్సరం (జూన్ నెల) వరకు మరో మూడు నెలలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ జంట నగరాలకు తాగు నీటి అవసరాలకు ఇబ్బందులు ఏర్పడతాయని నీటి పారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ నీటి సంవత్సరంలో ఆగస్టు 5వ తేదీ మార్చి 12వ తేదీ వరకు సాగర్ కుడి కాల్వకు 174 టీఎంసీల నీటిని, ఎడమ కాల్వకు 125 టీఎంసీల నీటిని విడుదల చేశా రు. ఇప్పటికైనా కేఆర్ఎంబీ జోక్యం చేసుకొని రెండు రాష్ట్రాల ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సాగర్ నుంచి నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలని పలువురు నీటిపారుదల శాఖ నిపుణులు కోరుతున్నారు.


నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ప్రవహిస్తున్న నీరు

ప్రస్తుతం సాగర్ నీటిమట్టం

సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 521.60 అడుగులు (152.2102 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమకాల్వ ద్వారా 7684 క్యూసెక్కుల నీటిని, కుడి కాల్వ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు. సాగర్ నుంచి మొత్తం 17,787 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 11 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిత్య పూజలు రద్దు చేశారు. మంగళవారం ఉత్సవాలు ముగింపు కావడంతో బుధవారం నుంచి నిత్య పూజలు పునరుద్ధరించారు. ఇందులో భాగంగా సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు.

అన్నదానానికి విరాళం అందజేత

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన కర్నాటి రమేష్, శ్రీదేవి దంపతులు బుధవారం రూ.5లక్షల చెక్కును ఈవో ఏ.భాస్కర్‌రావుకు అందజేశారు. ఈవోతో ఆలయ ప్రధానార్చకుడు నల్లంథిగళ్ లక్ష్మీనరసింహాచార్యులు ఉన్నారు.

స్థానిక కళాకారులకు అవకాశం ఇవ్వాలి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ప్రతీ శుక్ర, శని, ఆది వారాల్లో కొండపైన నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలోని కళాకారుల ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అన్నారు. యాదగిరికొండపై బుధవారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈవో భాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఈవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో రైళ్లను ఆపాలి

• పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ చామల

రామన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో కరోనా సమయం నుంచి పలు రైళ్లను ఆపడం లేదని, ఆ రైళ్లను పునరుద్ధరించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రస్తావించారు. నారాయణాద్రి, ఫలక్‌నామా, డెమో, చెన్నై ఎక్స్‌ప్రెస్, శబరి ఎక్స్‌ప్రెస్, డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామన్నపేటలో ఆపేలా చర్యలు తీసుకోవాలని ప్రస్తావించారు. రామన్నపేట మండలంలో 50వేలకు పైగా జనాభా ఉందని, విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రైళ్లను రామన్నపేటలో ఆపాలని కోరారు.

దేవరకొండ సబ్ జైలు తనిఖీ



దేవరకొండ సబ్ జైలు వద్ద గౌరవవందనం స్వీకరిస్తున్న డీఐజీ శ్రీనివాస్

దేవరకొండ, మార్చి, 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ సబ్ జైలును జైళ్ల హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఐజీ శ్రీనివాస్‌కు జిల్లా జైళ్ల శాఖ అధికారి ప్రమోద్, దేవరకొండ సబ్ జైలర్ హర్షవర్దన్, సిబ్బంది స్వాగతం పలికి గౌరవవందనం చేశారు. సబ్ జైలులోని ఖైదీల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంజీయూ ప్రతిపాదనల పరిశీలన

• యూనివర్సిటీలో పర్యటించిన ఇన్‌స్పెక్షన్ కమిటీ


యూనివర్సిటీని పరిశీలన చేస్తున్న బృందం

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనల నివేదికను పరిశీలించడం కోసం బుధవారం ఇన్‌స్పెక్షన్ కమిటీ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో విద్యాధర్‌రెడ్డి, బాలకృష్ణ, మృణాళిని, శోభరాణి బృందం ఈ పరిశీలన చేశారు. ఉపకులపతి ఆచార్య అల్తాఫ్ హుస్సేన్‌తో సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, ఎంఏ గవర్నన్స్, పబ్లిక్ పాలసీ, ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, బీఫార్మసీ ప్రవేశ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధ్యాపక పోస్టులకు, భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వీసీ తెలిపారు. వివిధ భవన నిర్మాణాలకు రూ.309.65 కోట్ల ప్రతిపాదనలు పం పినట్లు తెలిపారు. ఇన్‌స్పెక్షన్ కమిటీ త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి, ఉన్నతామండలికి అందించనుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, రమేష్, ప్రశాంతి, సుధారాణి, ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, శ్రీదేవి, రేఖ, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన విదేశీ మీడియా ప్రతినిధులు


బుద్ధవనంలో విదేశీ మీడియా ప్రతినిధులు

నాగార్జునసాగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను బుధవారం విదేశీ మీడియా ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారతీయ సాంకేతిక, ఆర్థిక సహకారం కార్యక్రమంలో భాగంగా పలు దేశాలకు చెందిన జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు మీడియా మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనకు సాగర్ సందర్శనకు వచ్చారు. నేపాల్, శ్రీలంక, గయానా, టాంజానియా, సూరినేమ్ దేశాలకు చెందిన 28 మంది మీడియా ప్రతినిధులు సాగర్‌లో పర్యటించారు. మొదటగా బుద్ధవనానికి చేరుకున్న వారు బుద్ధవనంలో స్థూపవనం, జాతకవనం, ధ్యాన వనం, మహాస్థూపాలను తిలకించారు. అనంతరం పర్యాటక శాఖ లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు చేరుకొని అక్కడ మ్యూజియం, సింహళీయం, బౌద్ధమత స్థూపాలు, నమూనాలను తిలకించారు. ఆ తర్వాత సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని తిలకించారు. వారి వెంట మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

స్థానికులకు టోల్ రుసుం ఎత్తివేయాలి : అఖిలపక్షాలు


చిల్లేపల్లి వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నేతలు

నేరేడుచర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రం శివారులో మూసీ నది వంతెన సమీపంలో చిల్లేపల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్‌లో రుసుంను స్థానికులకు మినహాయించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నేరేడుచర్ల అఖిలపక్ష నేతలు బుధవారం చిల్లేపల్లి వద్ద ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు రాస్తారోకో నిర్వహించారు. దీంతో కిలోమీటరు వరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పినా అఖిలపక్ష నాయకులు రాస్తారోకోను విరమించలేదు. దీంతో టోల్‌గేట్ మేనేజర్ ఇబ్రహీంను పోలీసులు పిలిపించారు. నేరేడుచర్ల పట్టణ ప్రజలకు టోల్ మినహాయిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొణతం చిన వెంకటరెడ్డి, దొండపాటి అప్పిరెడ్డి, నగేష్, ధనుంజయనాయుడు, నాగిరెడ్డి, శ్రీధర్, ప్రకాష్, నాగేశ్వరావు, శ్రీనివాసరావు, వెంకటయ్య, సురేష్, జితేందర్‌రెడ్డి, జంగయ్య, నవీన్, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.


20 కిలోమీటర్ల పరిధిలో వర్తింపజేయకూడదు


మిర్యాలగూడ, (ఆంధ్రజ్యోతి): చిల్లేపల్లి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లో 20 కిలోమీటర్ల పరిధిలో టోల్ ఎత్తివేయాలని తెలంగాణ మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆలగడప గ్రామస్థులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఆలగడప గ్రామస్థులు జనార్ధన్‌రావు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


గ్రూప్స్ ఫలితాల్లో జిల్లా వాసుల ప్రతిభ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): టీజీపీఎస్సీ సోమ, మంగళవారం విడుదల చేసిన గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభ్యర్థులు ప్రతిభ చూపారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో..


నాగార్జున


శ్రీరాం మధు


శ్రీరాం నవీన్

పెన్‌పహాడ్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ఐతబోయిన నాగార్జున రాష్ట్రస్థాయిలో 130 ర్యాంకు రాగా మార్కులు 388. 6 మార్కులు సాధించారు. ఇదే మండలానికి చెందిన మహ్మదాపురం గ్రామానికి చెందిన శ్రీరాంమధు 4వ ర్యాంకు రాగా 438.9 మార్కులు, శ్రీరాం నవీన్ 326 ర్యాంకు రాగా 376.1 మార్కులు సాధించాడు. శ్రీరాంమధు, శ్రీరాంనవీన్‌లు అన్నదమ్ములు.

● నేరేడుచర్ల: మండలంలోని బూరుగులతండాకు చెందిన మాలోతు తేజ గ్రూప్-2లో 512వ ర్యాంకు సాధించాడు. ఎస్టీ విభాగంలో 20వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం కేరళలో ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే మంచి ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


మాలోతు తేజ

● మునగాల రూరల్ : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన గుండు లక్ష్మీనారాయణ వర్మకు గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించారు. లక్ష్మీనారాయణ గతంలో ఆదాయపన్ను శాఖలో చెన్నైలో విధులు నిర్వహిం చడని, గ్రూప్-4 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు సాధించి కోదాడ పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. గ్రూప్ 2లో 29వ ర్యాంకు సాధించడం పట్ల తమకు ఎంతగా నో ఆనందంగా ఉందని అతడి తండ్రి శ్రీనివాసరావు తెలిపారు.


లక్ష్మీనారాయణ

నల్లగొండలో జిల్లాలో..


చంద్రారెడ్డి


బాలరాజు

చిట్యాలరూరల్ : మండలంలోని తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కుటిరెడ్డి చంద్రారెడ్డి గ్రూప్-2 లో 53వ ర్యాంకు సాధించారు. చంద్రారెడ్డి ప్రస్తుతం అడవిదేవులపల్లి మండలం చంప్లాతండా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అలాగే తాళ్లవెల్లంలలో పంచాయతీ కార్యదర్శిగా చేస్తున్న గడిగ బాలరాజు గ్రూప్-2లో 371 మార్కులతో 442వ ర్యాంకు సాధించాడు.

● నిడమనూరు : మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన చామల వినీషారెడ్డి ప్రతిభ కనబర్చి 408.7 మార్కులతో 32వ ర్యాంకు సాధించారు. వినీషారెడ్డి భర్త గ్రామానికి చెందిన చామల దత్తుకుమార్ రెడ్డి యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వినీషారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో హోమియోపతి వైద్యురాలిగా పని చేస్తున్నారు. గ్రూప్స్ ఫలితాల్లో వినీషారెడ్డి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.


వినీషారెడ్డి

గ్రూప్-1 ఫలితాల్లో..


గుర్రంపోడు: మండలంలోని జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్ ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో 475 మార్కులు సాధించి డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ నిజాం కాలేజీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి రైల్వే, ఫా రెస్ట్ ఆఫీసర్, పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాలకు ఎంపిక గా, ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణాయుతమైన విద్యాబోధ న వల్లే తాను జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగానని అ న్నారు. గురువులకు రుణపడి ఉంటానని తెలిపారు.


ముడుసు శ్రీకాంత్

● మునుగోడు రూరల్: మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి వెంకటరమణారెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి 2019లో బీటెక్ పూర్తి చేశారు. 900 మార్కులకు గాను 517 మార్కులు సాధించి గ్రూపు-1 ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


మనోజ్ కుమార్ రెడ్డి

● మర్రిగూడ : మండల కేంద్రా నికి చెందిన ముకురోజు విన య్‌కుమార్ 450మార్కులతో తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం గుర్రంపోడు మం డలంలో ఇప్పటికే పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సామన్య కుటుంబ నుంచి గ్రూప్ ఉద్యోగం సాధించడం పట్ల వినయ్ కుమార్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు, హర్షం వ్యక్తం చేశారు.


వినయ్ కుమార్

నాంపల్లి ఎంపీడీవోగా పీవీఎస్ఆర్కే శర్మ



నాంపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎంపీడీవోగా పల్లి వెంకట శ్రీరామకృష్ణ శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేస్తున్న స్వర్ణమేరి కుమారి సిద్దిపేట జిల్లాకు బదిలీ కాగా సిద్దిపేట జిల్లా ములుగు మండలం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై నాంపల్లికి వచ్చారు.

చండూరు ఎంపీడీవోగా బండారు యాదగిరి



చండూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చండూరు మండల ఎంపీడీవోగా బండారు యాదగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పోచారం రాంరెడ్డి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలానికి ఎంపీడీవోగా వెళ్లారు.

రైతులకు ఉపయోగపడేలా..

యాదయ్య, ఏపీవో, నార్కట్‌పల్లి



రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులను చేపడుతున్నట్లు ఏపీవో యాదయ్య తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని 29 గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాం. ఈ ఏడాది లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం. - (నార్కట్‌పల్లి,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి? ఎంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు?

ఏపీవో: మండలంలోని మొత్తం 29 గ్రామాల్లో 12,237 జాబ్‌కార్డులు ఉన్నాయి. 29 గ్రామ పంచాయతీలకు గాను కేవలం 13 మంది మాత్రమే ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులెన్ని?

ఏపీవో: వివిధ పనులకు సంబంధించి మొత్తం 255 పనులను గుర్తించగా అన్నీ ప్రగతిలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఈ సంవత్సరానికి నిర్దేశించిన పనిదినాలెన్ని?

ఏపీవో: 2024-25 సంవత్సరంలో జూన్ నెలాఖరు నాటికి 1,95,187 పని దినాలు లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో ఇప్పటికే 1,69,721 పని దినాలను పూర్తిచేశాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులేవి?

ఏపీవో: ఉపాధి హామీ పథకం కింద కందకాల తవ్వకం, భూ అభివృద్ధి పనులు, వరద కట్టల నిర్మాణం, పాంపాండ్స్ వంటి పనులు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: రోజువారీగా ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు.

ఏపీవో: 29 జీపీలలో కలిపి సుమారు 1080మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పని ప్రదేశాల్లో కూలీలకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు. ఎప్పటి వరకు బిల్లులు వచ్చాయి?

ఏపీవో: పని ప్రదేశాల్లో కూలీలకు నీడ వసతిని కల్పిస్తున్నాం. మంచినీటిని కూలీలే తెచ్చుకుంటున్నారు. జనవరి వరకు కూలీలకు డబ్బులు ఇచ్చాం.

రోడ్డు అంచుల్ని కప్పేసిన మట్టి

● ద్విచక్రవాహనాలకు పొంచి ఉన్న ప్రమాదం ● భారీ వాహనాల కారణంగా మట్టితో మూసుకుపోతున్న ఎడ్జ్‌లైన్ మార్కు





హైవేపై నార్కట్‌పల్లి శివారులో ఓ హోటల్ ఎదురుగా మట్టితో మూసుకుపోయిన రోడ్డు అంచు (ఇన్‌సెట్‌లో) కనిపించని రోడ్డు అంచు

నార్కట్‌పల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు ఏ రూపంలో జరుగుతాయో ఎవరూ ఊహించలేరు. జాతీయ రహదారిపై దట్టంగా కమ్ముకుంటున్న మంచే కాదూ... రోడ్డు అంచుల్లో పేరుకున్న మట్టి ప్రమాదాలకు ఆస్కారమిస్తోంది. జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి శివారులోని దాబా హోటళ్ల ఎదురుగా రోడ్డు అంచులపై చేరిన మట్టి ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా భారీ వాహనాలు ఆగే హోటళ్ల వద్దే ఎక్కువగా ఈ పరిస్థితి నెలకొంది. హోటల్ వద్ద ఆగిన వాహనాలు తిరిగి రోడ్డు ఎక్కే క్రమంలో 1.5 మీటరు వెడల్పులో ఉండే రోడ్డు అంచుపై పూర్తిగా మట్టి చేరుతోంది. ఈ మట్టిని అటు హోటల్ నిర్వాహకులు కానీ ఎన్‌హెచ్ సిబ్బంది కానీ తొలగించకపోడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాలు ఎడమ వైపు ఓవర్ టేక్ చేసుకుంటూ వెళ్లే సమయంలో భారీ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు అంచులో వెళ్లే ద్విచక్రవాహనాలు రోడ్డు కిందకు దిగే క్రమంలో పేరుకుపోయిన మట్టి కారణంగా అదుపుతప్పి కింద పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంటోంది. నేషనల్ హైవే అథారిటీ సంస్థ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను గుర్తించి ఎప్పటికప్పుడు మట్టిని ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రమాద నష్టం జరగకముందే స్పందించాలి



హైవే పై పలు హోటళ్ల ఎదురుగా రోడ్డు అంచులను మట్టి కప్పేస్తుంది. కప్పేసిన మట్టిపై ప్రయాణిస్తూ ద్విచక్రవాహన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాద నష్టం జరగకముందే హైవే అథారిటీ అధికారులు స్పందించాలి. ఎప్పటికప్పుడు మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

- మేడి హరికృష్ణ, నార్కట్‌పల్లి

వేణుగోపాలస్వామి కల్యాణం రేపు



ఉత్సవమూర్తులు

కనగల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో స్వస్తివాచనం, అంకురార్పణ పూజలు జరిగాయి. గురువారం గరుడముద్ద, శుక్రవారం స్వామివారి కల్యాణం, శనివారం రాత్రి శేషవాహనసేవ, ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు సోమవారం రథసేవ, పూర్ణాహుతి, దోపోత్సవం, మంగళవారం పుష్పయాగం ఏకాంతసేవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ శ్రీనివాస్‌రావు, తిరుమలనాథ్, శ్రీనివాస్‌చక్రవర్తి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జాతరను విజయవంతం చేయాలని కోరారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

దేవరకొండ డీఎల్‌పీవో శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మర్రిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని దేవరకొండ డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవికాలంలో భూగర్భజలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని, గ్రామాల్లో పర్యటించి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఎల్‌పీవో శంకర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మున్నయ్య, ఎంపీవో రవికుమార్, ఏపీవో వివేక్, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి



మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో బుధవారం మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ మూడు నెలల జీతాలు ఇవ్వకపోవడంతో పాటు ఆరు నెలల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని ఆరోపించారు. ఏజెన్సీ నుంచి జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మధు, మురళి, రాజు, జమీర్, జక్కీర్, అండాలు, సైదమ్మ, సాయికుమార్, లింగయ్య, శిల్ప, రజిత, స్వప్న, లలిత పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలను పాటించాలి

నార్కట్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మ, సంప్రదాయాలను ఆచరిస్తూ ముందు తరాలకు అందించాలని ఆదిశంకరాచార్య పీఠం గురుస్వామి పనస కబీర్‌దాసు పిలుపునిచ్చారు. మండలంలోని చిప్పలపల్లిలోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. మన జీవన విధానం హిందూ సంప్రదాయంతో ముడిపడి ఉందన్నారు. ధర్మాన్ని ఆచరిస్తూ ప్రతీ గ్రామం ప్రతీ హిందూ ఇంట్లో సంప్రదాయాలను పాటించాలన్నారు. భక్తి ప్రపత్తులు మనిషిలో మంచి గుణాన్ని అలవరుస్తుందన్నారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు విరివిగా చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చలిదోన లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాంపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగపాడు గౌరారంలో కొండపై వెలసిన చలిదోన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా బుధవారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 9 నుంచి బ్రహ్మోత్సవాలు 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బుధవారం నిర్వహించిన రథోత్సవం డబ్బు చప్పుళ్ల, కోలాటాల మధ్య వైభవంగా నిర్వహించారు స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించారు. స్వామివారి రథాన్ని లాగడానికి గౌరారం, తుంగపాడ్, లింగోటం మల్లప్ప రాజుపల్లి గ్రామాల యువకులతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఏడాదికి ఒకసారి జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి జెల్లపల్లి జయరామయ్య, ఉత్తమ కమిటీ చైర్మన్ వట్టి కోటి రవి, కొమ్ము బిక్షం దండిగా నరసింహ, కడారి శ్రీశైలం యాదవ్, నేతల కొండల్, ముమ్మడి కృష్ణారెడ్డి, వట్టికోటి నరేష్, మేకల దేవేందర్, చిలుకూరి బిక్షం, అధిక సంఖ్యలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మర్రిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరభీమనపల్లి గ్రామంలో రూ.11లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను గ్రామ మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి సహకారంతో గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మలిగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జగాల్‌రెడ్డి, జిల్లా శంకర్, జిల్లా కృష్ణయ్య, నక్క తిరుపతయ్య, పాపయ్య, తిరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి : డీఎస్పీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలుగుతూ మంచి మార్గం వైపు పయనించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నారు. నల్లగొండ మండల పరిధిలోని దోమలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ శివరాంరెడ్డి హాజరై మాట్లాడుతూ నేటి ప్రపంచంలో అనేక మాయాజాలంతో ఆన్‌లైన్లు, బెట్టింగుల పేరుతో మోసం చేస్తూ సమాజాన్ని పక్కదారి పట్టించే కేటుగాళ్లకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగులు, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు విద్యార్థి దశ నుంచే దూరంగా ఉండాలని సూచించారు. అంతేకాక వాటిని నియంత్రించడంలో కూడా విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అదే విధంగా పీఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు విద్యార్థులకు మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదాబాబు, ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాలపై వ్యాసరచన

చిట్యాలరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లోని 4నుంచి 10వ తరగతి విద్యార్థులకు బుధవారం జాతీయ భద్రతా వారోత్సవాలపై దొడ్ల డెయిరీ ఆధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పోటీలో ప్రతిభను చూపిన విద్యార్థులకు డెయిరీ సౌజన్యంతో ప్రతినిధులు ఎన్.సత్యనారాయణ, కె.ఫణీంద్ర, ప్రధానోపాధ్యాయుడు ఎ. వెంకట్‌రెడ్డిలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, పి.వెంకట్‌రావు, అఫ్జల్‌షరీఫ్, వి.పద్మ, జి.రాంరెడ్డి, ఎస్. వెంకటరమణ, పి.రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరు సీఐగా ఆదిరెడ్డి



చండూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మల్టీజోన్ -2 విభాగంలో విధులు నిర్వహిస్తున్న కె.ఆదిరెడ్డిని చండూరు సీఐగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2023జూలై 9 నుంచి ఇక్కడ పని చేసిన సీఐ ఏ.వెంకటయ్య హైదరాబద్ సీటీ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో శాంతి భద్రతలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

వర్గీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడించాలి



రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న బోడ సునీల్ మాదిగ

శాలిగౌరారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టం వెంటనే అమలు చేయాలని, అమలు చేసిన తర్వాతే ఉద్యోగ ఫలితాలు వెల్లడించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండలంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రంలో 32 లక్షలకుపై ఉన్న మాదిగలకు రావాల్సింది 11 శాతం కానీ 9 శాతం నిర్ణయించి మాదిగలను తక్కువ జనాభా చూపెడుతూ తమ వాటాను మాల కులానికి దోచిపెడుతోందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేయక ముందే గ్రూపు 1, గ్రూపు 2, గ్రూపు 3లతో పాటు ఇతర అన్ని ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న ప్రభుత్వం వాటిని వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేనిచో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేడ్కర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బట్ట శ్రీనివాస్, బట్ట సైదులు, బాకీ వెంకన్న, మాగి నాగయ్యబొడ్డు నాగరాజు, దుపెల్లి అశోక్, వేముల శ్రీకాంత్, తోటకూరి సతీష్, తిరుమలేష్, రఘు, జనార్ధన్, మధు, నగేష్, కిరణ్, గణేష్, అనిల్, నరసింహ, నాగేష్, నరేష్, వెంకటేష్, ప్రశాంత్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు

మాయమాటలతో రైతులను ముంచిన ప్రభుత్వం



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మాయ మాటలు చెప్పి వారిని నట్టేటా ముంచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. నల్లగొండ మండలంలోని రాములబండ, రంగారెడ్డినగర్ తదితర గ్రామాల్లో బుధవారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 13 నెలలు గడిచినా రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. లో వోల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్యలతో మోటార్లు కాలిపోయి పొలాలు పొట్ట దశలో నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన నష్టాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పంట పొలాలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, నలగొండ మండల అధ్యక్షుడు బొగరి అనిల్‌కుమార్, ఫకీర్ మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నరసింహ, రుక్మాగౌడ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల అరెస్టు, విడుదల



పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేసిన పంచాయతీ కార్మికులు

కేతేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఆకలి కేకలను ఆపలేరని సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ళ సుధీర్ అన్నారు. తమన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయితీ కార్మికులు చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం కేతేపల్లి పోలీసులు సుధీర్‌తో పాటు పలువురు గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సుధీర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల అరెస్టు చేసి నిర్బంధించడం ప్రభుత్వ నిరంకుశానికి పరాకాష్ట అని విమర్శించారు. హక్కుల సాధనకు శాంతియుత ఉద్యమానికి వెళ్తున్న కార్మికులను పోలీసులు నిలువరించి అరెస్టు చేయడం సరైందికాదన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను పాలకులు నిలువరించలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, వెంకన్న, జ్యోతి, వెంకటయ్య ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న గోపగాని మాధవి

నల్లగొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి అభ్యర్థులను ఎంపిక చేసిందని మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో శంకర్‌నాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సమన్యాయం పాటించిందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి అవకాశం దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. బీసీ కులగణనతో రాబోయే ఎన్నికల్లో బీసీలకు 42శాతం అవకాశాలు దక్కుతాయన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, మహిళలు అండగా ఉండాలన్నారు.

చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నారాయణ



దోటి నారాయణ


చండూరు, మునుగోడు రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): చండూరు మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన దోటి నారాయణ, వైస్ చైర్మన్‌గా చండూరు మండలం శిర్దేపల్లి గ్రామానికి చెందిన పోలు వెంకట్‌రెడ్డితో పాటు మరో 16మందిని డైరెక్టర్లుగా ఉన్నతాధికారులు ప్రకటించారు. మునుగోడు మండలం నుంచి డైరెక్టర్లుగా సీపీఐ నాయకుడు చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మరగోని మంగమ్మ, లాలు, షేక్ హైమద్, కుంభం చెన్నారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ మాట్లాడుతూ తన నియమానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి కత్తుల రవి తెలిపారు.

గ్రామాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నాంపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పోరుబాటలో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా సీపీఎం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వాసిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, కొమ్ము ముఖేష్, అందుగుల రాములు, బిక్షమయ్య, పర్వతాలు, శ్రీను, పాల్గొన్నారు.

ఐద్వా పోరాటాలతోనే మహిళా సాధికారత

● ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి




ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న ప్రభావతి

నల్లగొండరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల సాధికారత ఐద్వా పోరాటాలతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోనా దొడ్డి కొమరయ్య భవనంలో ఐద్వా జెండాను ఆమె ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఐద్వా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మహిళల సమస్యలపై అనేక పోరాటాలు చేసి పరిష్కరించినట్లు తెలిపారు. మహిళలపై జరుగుతున్న హింసల వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, అందుకు ప్రతి ఒక్క మహిళ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, పట్టణ జిల్లా కమిటీ సభ్యులు ఉమ, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

*** ఇఫ్తార్ : 6.31 | సహర్ : 5.03 (శుక్రవారం)

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 13 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 , కనిష్ఠం 20.2

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210



మండుతున్న ఎండలు

- అనూహ్యాంగా పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- జిల్లాలో గరిష్ఠంగా 39 డిగ్రీల నమోదు
- నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో 40.3
- పేట జిల్లా మద్దిరాలలో 39.6 డిగ్రీలు

యాదాద్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. ఈసారి ఎండలు ఠారెత్తనున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ విపరీతంగా ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఎండలు మార్చి రెండోవారం నుంచి ప్రారంభమవుతాయి. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ముందస్తుగానే ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నంవేళ ఎండవేడికి జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మార్చిలోనే ఈవిధంగా ఎండలు

మిగతా 6వ పేజీలో...

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
6	35.6	28.0
7	37.5	25.3
8	39.1	26.8
9	36.3	25.9
10	36.0	26.5
11	35.9	26.8
12	38.7	31.0

నిధులు లేక నిలిచిన పనులు

గ్రామపంచాయతీల్లో నిధుల లేమితో పనులు ముందుకు సాగడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సరఫరా కోసం చేపట్టాల్సిన ప్రత్యేక పనులకూ ఆటంకం కలిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన నాటినుంచి పంచాయతీల్లో పాలన కుంటుపడింది. పనులన్నీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులే వీడీసీల ద్వారా చేపట్టాల్సి రావడంతో చేసిన పనులకు బిల్లులు పెండింగ్ ఉండటంతో మిగతా పనులు చేయలేని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 1,740 పంచాయతీల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉండగా, వేసవి ఎలా గడుస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో మంత్రులు సమావేశం నిర్వహించి నిధుల విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకునేందుకు నిధులు విడుదల చేస్తామని, కలెక్టర్ల వద్ద అవసరమైన నిధులు ఉంచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని మంత్రులు హామీ ఇవ్వడం గ్రామాల్లో నెలకొన్న పరిస్థితిని తెలియజేస్తోంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- పెండింగ్ బిల్లులతో గ్రామాల్లో పనులు చేయించలేని దుస్థితి
- చేతులెత్తేసిన కార్యదర్శులు
- మంత్రులకూ వినతిపత్రాలు ఇచ్చిన వైనం
- ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.45కోట్ల బిల్లులు పెండింగ్
- అత్యవసర పనులకు కలెక్టర్ల వద్ద నిధులు ఉంచాలనే సూచనలు



వేసవి కారణంగా గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడటంతో నల్లగొండ మండలం కంచనపల్లిలో కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)ల ద్వారా అత్యవసర పనులను కార్యదర్శులు చేయించారు. ప్రధానంగా తాగునీటి మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్లు, వీధి దీపాల ఏర్పాటు, బ్లీచింగ్, శానిటేషన్ సామగ్రి, ఫాగింగ్ లిక్విడ్ కొనుగోలుతోపాటు, ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా బాధ్యత వారిపైనే పడింది. ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చిన 14 నెలల నుంచి కార్యదర్శులే ఈ పనులు చేయిస్తున్నారు. అందుకు సంబంధించిన బిల్లులను జూలై వరకు చెల్లించిన ప్రభుత్వం ఆగస్టు నుంచి చెల్లింపులను పెండింగ్‌లో పెట్టింది. ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులకు వడ్డీల భారంతో పాటు, వీడీసీలు సైతం పనులు చేయకుండా పాత బిల్లుల కోసం ఒత్తిడి తెస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో సుమారు రూ.21.20కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.15.60కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.9కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. ఈ బిల్లులు ఇప్పించకపోతే పనులు చేయించలేమని, తక్షణం వాటిని మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రికి, ఎమ్మెల్యేలకు పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు, టీఎన్‌జీవో నాయకులు వినతిపత్రాలు అందజేశారు. బిల్లులు వస్తేనే వేసవిలో పనులు చేయించగలమని, లేదంటే ఇబ్బందులు తప్పవని వారు చెబుతున్నారు. గ్రాంట్లు రాకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని, ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ల వద్ద ప్రత్యేక నిధులు!

గ్రామ పంచాయతీలతోపాటు మునిసిపాలిటీలకు సైతం పాలకవర్గాలు లేవు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండాలంటే

మిగతా 6వ పేజీలో...

ఆయకట్టు చివరి భూములకు సాగునీరందాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, కనగల్, పెద్దవూర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు ఎండిపోకుండా ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని, దీనికి రైతులు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం గుర్రంపోడు, కనగల్ మండలాల పరిధిలోని డీ-25, డీ-8, 9 కాల్వలను కలెక్టర్ తనిఖీ చేశారు. కాల్వ కింద చివరి భూమి వరకు సాగునీరు అందుతుందా? లేదా? అని పరిశీలించారు. గుర్రంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద, మారేపల్లి వరకు కాల్వను పరిశీలించి ఆమె మాట్లాడారు. రైతులు కాల్వలకు గండ్లు కొట్టడం, నీరు మళ్లించుకోవడం వంటి చేయవద్దన్నారు. వారి పరిధిలో ఉన్న ఫీడర్ ఛానళ్లు, సబ్ మైనర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే సాగునీరు సులభంగా వస్తుందని, అలాగే వచ్చే సీజన్‌కు నీరు సులభతరంగా అందుతుందన్నారు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎక్కువ నీటిని విడుదల చేసినందున రాత్రిలోపు కాల్వ చివరి వరకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. నీటిని రైతులు జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. కాల్వల్లో వచ్చే నీరు ఆయకట్టు చివరి భూముల వరకు అందేలా ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారులు సైతం బాధ్యత తీసుకోవాలన్నారు. కాల్వలకు గండ్లు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, ఈఈ నెహ్రూనాయక్, ఉన్నారు.



పెద్దవూర మండలంలో డీ-8, 9 కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి(సాగర్)): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని రంగుండ్ల తండాను సందర్శించి ధర్తీ ఆబా జన్‌జాతీయ్ ఉత్కర్ష్ అభియాన్‌కు సంబంధించి గ్రామంలో చేపట్టిన మౌలిక వసతులను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, పథకం గురించి అవగాహన కల్పించారు. తండాలో జల్ జీవన్‌లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా వాన నీటిని సంరక్షించే కట్టడాలు, సోలార్ లైట్లు, 10హెచ్‌పీ సోలార్ పంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ భవనం, గ్రంథాలయం, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఎంఎస్‌ఎంఈ కింద మిర్చి పంటకు సంబంధించిన ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా చేపలు పెంచేందుకు ఒక ఎకరం స్థలంలో నమూనా బ్లాక్‌ను ఏర్పాటు చేస్తామని, ఉద్యాన పంటలకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

గత ఏడాది నవంబరు 15న ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించారని, జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా రంగుండ్లతండాను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆమె వెంట జిల్లా ఇన్‌చార్జి గిరిజన అభివృద్ధి అధికారి, గృహ నిర్మాణశాఖ అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీవో మల్లీశ్వర్, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగమణి, ఎస్‌ఐ వీరశేఖర్, ఆర్‌ఐ లక్ష్మీకాంత్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోతు పాండు, బాలునాయక్, హరినాయక్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పన

మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ రాష్ట్ర డైరెక్టర్ శివరాంప్రసాద్



వైద్య సేవల గురించి అడిగి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శివరాం ప్రసాద్

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ రాష్ట్ర డైరెక్టర్ శివరాంప్రసాద్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఐసీయూ, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, మాతశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ, ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని, త్వరలోనే పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామన్నారు. మందుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, రోగులందరికీ వైద్యం అందించేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతామన్నారు. నెల రోజుల్లోపు కౌన్సిలింగ్ నిర్వహించి వైద్య పోస్టులు భర్తీ చేస్తామన్నారు. పెరిగిన పడకల సామర్థ్యానికి అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను నియమించేందుకు అనుమతించామన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ అరుణకుమారి ఉన్నారు.

ఆస్పత్రిలో డిప్యుటేషన్లు రద్దు : కలెక్టర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిప్యుటేషన్ రద్దుతో పాటు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అవుట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంఈకి వివరించారు. ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వైద్య కళాశాలలో సిబ్బందిని పెంచేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వీటి భర్తీకి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, ఉన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు

ఏర్పాట్లు పూర్తి




పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- నేటి నుంచి క్రీడా పోటీలు
- ప్రారంభించనున్న కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటూ, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆటవిడుపు కల్పించేందుకు జిల్లా పోలీస్‌శాఖ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించేందుకు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నిర్ణయించగా, అందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది డివిజన్ల వారీగా ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్‌తో పాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి రిహార్సల్స్ కూడా పూర్తయ్యాయి. 13న ఉదయం పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభించనున్నారు. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్‌తో పాటు ఏఆర్ కానిస్టేబుళ్ల జట్టు కూడా పాల్గొననున్నాయి.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య



రేషన్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఓఎస్డీ అంజయ్య

మర్రిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తే డీలర్లకు కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విజిలెన్స్ ఓఎస్డీ అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేషన్ దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. బియ్యం పంపిణీ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్, డీఎస్‌టీ యాదయ్య, తహసీల్దార్ కమాల్‌పాషా, తదితరులు ఉన్నారు.

పథకాల్లో లబ్ధిచేకూరేలా చూడాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



బుద్ధుడి పాదాల వద్ద అంజలి ఘటిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నాగార్జునసాగర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మానవతా దృక్పథంతో వివిధ పథకాల్లో లబ్ధి చేకూరేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన సాగర్ సందర్శనలో భాగంగా హైలాన్ కాలనీలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలను, ప్రధాన డ్యాంను తిలకించారు. ఈ సందర్భంగా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో నీటిపారుదల శాఖ, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇంజనీరు కోటేశ్వర్‌రావు, జిల్లా ఎస్సీ శాఖ అధికారి వెంకట కృష్ణ, జయపాల్, నీటిపారుదల శాఖ, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులు, పాల్గొన్నారు.

బుద్ధవనం అద్భుతం..

ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం అద్భుతంగా ఉందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రాత్రి బస సాగర్ విజయవిహార్ అతిథి గృహంలో చేశారు. బుధవారం సాగర్ సందర్శనలో భాగంగా జలాశయంలో పర్యాటక శాఖ లాంచీలో జాలీ ట్రిప్పులో తిరిగారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలను తిలకించారు. ఆ తర్వాత బుద్ధవనానికి చేరుకున్న ఆయనకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ రవిచంద్ర స్వాగతం పలికారు. బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత బుద్ధవనంలో చరిత వనం, స్తూప వనం, జాతక వనం, ధ్యాన వనాలను తిలకించారు మహాస్తూపంలో కాసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బుద్ధవనాన్ని సందర్శించాలన్నారు. బుద్ధవనంలో బుద్ధుని జీవితాన్ని కళ్లకు కట్టినట్లు బొమ్మల రూపంలో చక్కగా తీర్చిదిద్దారన్నారు. బుద్ధుని జీవితం సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా అద్భుతంగా శిల్పాలను మలిచారన్నారు. బుద్ధవనం, సాగర్ డ్యాం, విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, నల్గొండ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ పీడి కోటేశ్వర్‌రావు, ఎస్‌ఐ సంపత్, ప్రోటోకాల్ ఆర్‌ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ఎస్సీ, ఎసీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు జిల్ల శంకర్, నీలా దేవి, లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్‌లు బుధవారం నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలంలోని గుడితండాలో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపుతో గుడితండా పూర్తిగా ముంపునకు గురవుతోందని, తండావాసులందరికీ అన్ని వసతులతో కూడిన పునరావాసం కల్పించాలని పలువురు తండావాసులు కమిషన్ సభ్యులకు విన్నవించుకున్నారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులను తండావాసులు సన్మానించారు. కార్యక్రమంలో తండావాసులు శంకర్‌నాయక్, సక్రు, హనుమ, చిట్టిబాబు తదితరులున్నారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

ఏబీవీపీ ఎంజీయూ అధ్యక్షుడు రాగిఫణి హనుమాన్

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఎంజీయు ఏబీవీపీ అధ్యక్షుడు రాగిఫణి హనుమాన్ కోరారు. బుధవారం నాడు యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. విశ్వ విద్యాలయాల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకవస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగం కోసం కృషి చేస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. గత సంవత్సర బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులే కేటాయించిందని వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో సైతం చిన్న రాష్ట్రాలు అయినప్పటికీ 12 నుంచి 13శాతం కేటాయిస్తుంటే తెలంగాణలో మాత్రం అరకొరగా నిధులు కేటాయిస్తోందన్నారు. రాష్ట్రంలోని 11విశ్వవిద్యాలయాల్లో గతంలో 2,878 టీచర్ పోస్టులు మంజూరైతే ప్రస్తుతం కేవలం 753మాత్రమే పనిచేస్తున్నారని, 70శాతం ఖాళీలతో కాలం వెలదీస్తున్నారన్నారు. విలేకర్ల సమావేశంలో యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు మౌనేష్, రాజేష్, వెంకటేష్, విజయ్, తరుణ్, ప్రదీప్, సైదులు, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగిఫణి హనుమాన్

ఇంటర్ పరీక్షలకు 368మంది గైర్హాజరు

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు మొత్తం 13,511మంది విద్యార్థులకు గాను 13,143హాజరు కాగా 368మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,395మందికి గాను 11,120మంది హాజరు కాగా, 275మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,116మందికి గాను 2,023మంది హాజరు కాగా 93మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఏలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

నల్లగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ బస్సులను, అద్దె బస్సు సిబ్బందిని ఆర్టీసీలో విలీనం చేయాలని లేనట్లయితే సమ్మెకు సిద్ధమవుతామని జేఏసీ చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదూరు వెంకన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని విలీనం చేయాలని అనేక సార్లు పోరాటం చేసిన కూడా స్పందించక పోవడంతో సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. ఈనెల 17న యాజమాన్యంతో కార్మిక సంఘాల చర్చలు జరపడానికి మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చింత వెంకన్న, థామస్‌రెడ్డి, పల్లా దేవేందర్ రెడ్డి, కేఎస్ పాల్, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, పీఎంరావు, అప్పారావు, వెంకటయ్య, నరేందర్, యాదయ్య, పుల్లయ్య, ఎన్‌ఆర్‌సీ రాజు, ఎస్‌ఎస్ గౌడ్, జమాల్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సూచించారు. కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్స్, శానిటరీ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడంతో పాటు వ్యర్థాలను మురుగు కాల్వలు, ఓపెన్ ప్లాట్లలో వేయకుండా అవగాహన కల్పించాలన్నారు.

మిర్యాలగూడ డీఈగా శ్రీనివాసాచారి



మిర్యాలగూడ అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మిర్యాలగూడ డీఈగా శ్రీనివాసచారి బుధవారం బాధ్యతలు స్వీకరి ంచారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస సుధీర్‌కుమార్‌ను యాదాద్రి భువనగిరి ఎస్ఈ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అదేజిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసాచారిని నియమించగా విధులో చేరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

రామ్మూర్తి, ఎస్ఐ, కొండమల్లేపల్లి



మండలంలో దొంగతనాల నివారణ, శాంతిభద్రతల పరి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, హైవేపై ప్రమాదాల నివారణకు ఎస్ఐ రామ్మూర్తితో ఆంధ్ర జ్యోతి ఇంటర్వ్యూ.

(కొండమల్లేపల్లి,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి : మండలంలో దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: రాత్రివేళలో గస్తీ నిర్వహిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రధాన రహదారిలో 46 సీసీ కెమెరాలు పర్యవేక్షణతో నిఘా ఏర్పర్చాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాల నివారణకుఏం చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఐ : రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ఆటోలు, వివిధ వాహనాల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ద్వారా సూచనలు చేస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. హైవేపై ఎవరైనా అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపకుండా పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

ఎస్ఐ: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎవరైనా అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గస్తీ నిర్వహించి దాడులు నిర్వహిస్తున్నాం. అలాగే దేవరకొండ డివిజన్‌లో గృహనిర్మాణ దారులు ఇబ్బందులు పడకుండా అధికారులు గొట్టిముక్కల, ముదిగొండలలో రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

ఎస్ఐ : మండలంలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయి. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. పోలీసులకు ప్రజలు సహకరించాలి.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్

వేములపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు అని వాటిని కాపాడుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అన్నారు. మండలంలోని ఆమనగల్లు గ్రామంలో గల పార్వతీ రామలింగేశ్వరస్వామి జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. మన సాంస్కృతికి చిహ్నాలుగా నిలుస్తున్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆలయ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఆలయ భూములన్నింటిని త్వరలోనే సర్వే చేయించి మ్యాప్‌లు తయారు చేసి భూములను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, సురేష్, సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్ఐ వెంక టేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, వల్లంపట్ల ప్రవీణ్, అబ్రహం, పిల్లల సందీప్, పూజారి రెంటాల మణిశర్మ, ఈవో మృత్యుంజయశాస్త్రి, సభ్యులు జోజి, భిక్షం, కలమ్మ పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ, గ్రామస్థులు

చింతపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీదేడు(వెంకటంపేట) గ్రామ రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవాలు విజయవంతం చేయాలని రూపొందించిన వాల్ పోస్టర్ బుధవారం నిర్వాహకులు విడుదల చేశారు. 18న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కాయితి జితేందర్ రెడ్డి, ధరణిపతి రమణారావు ఆలయ పూజారి సురభి కృష్ణమూర్తి, ప్రత్యేక అధికారి శేఖర్, దాసరి శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

కొండమల్లేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రమావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. సమావేశంలో జొన్నలగడ్డ చరణ్, శ్రీరాం, సాయిరాం, శరత్ పాల్గొన్నారు.

● దేవరకొండ : బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి 15శాతం నిధులు కెటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలో జరిగిన ఏబీవీపీ పట్టణశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు సంజయ్‌కృష్ణ, అమితేజ్, ఈశ్వర్, సైదులు పాల్గొన్నారు.

గుడిపల్లి మండలంగా మార్చారు



'మండలం మారిన బోర్డు మారలే' అనే శీర్షికతో గుడిపల్లి మండల పాఠశాలల బోర్డులపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురి తమైంది. దీనికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. వెంటనే మండలంలోని పాఠశాలల బోర్డుపై పీఏపల్లి మండలం తొలగించి గుడిపల్లి మండలం రాయించారు. మాకు పూర్తిస్థాయి విద్యా వనరుల కేంద్రం ఏర్పాటు చేయలేదని ఉమ్మడి పీఏపల్లి మండలం నుంచే మిడ్ డే మీల్స్ బిల్స్ వస్తుందని ఇన్‌చార్జి ఎంఈవో సముద్రాల శ్రీనయ్య అన్నారు. అయిన గుడిపల్లి మండలం ఏర్పడిన సందర్భంగా మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండలం పేరు మార్చాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి),మార్చి12(ఆంధ్రజ్యోతి)

కేజీబీవీ ప్రారంభమెప్పటికో..?

● నాలుగు నెలల క్రితమే నిర్మాణం పూర్తి ● తాత్కాలిక భవనంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

కొండమల్లేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సొంత భవనం కోసం నాలుగేళ్లుగా నిరీక్షించారు. నిర్మాణం పూర్తయ్యిందన్న సంతోషం ఒక వైపు.. రేకుల షెడ్డులో తాము పడ్డ అవస్థలు తీరి పోతాయని అనుకున్న విద్యార్థినుల కల మాత్రం సాకారం కావడం లేదు. ఏడాదిలో పూర్తి కావాల్సిన కొండమల్లేపల్లి కేజీబీవీ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడానికి నాలుగేళ్ల కాలం పట్టగా.. నాలుగేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకొని నాలుగు నెలలు గడుస్తున్నా కొండమల్లేపల్లి కేజీబీవీ ఇంకా విద్యార్థినులకు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర నిరాశలో ఉన్నారు.



నిర్మాణం పూర్తయిన కొండమల్లేపల్లి కేజీబీవీ పాఠశాల

రేకుల షెడ్డులో విద్యాభ్యాసం

మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఓ ప్రైవేటు రేకుల షెడ్డులో 6 నుంచి 10వ తరగతి వరకు కేజీబీవీని నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందుల నడుమ విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున దాదాపు 220 మందివిద్య నభ్యసిస్తుండగా అద్దె భవనం రేకుల షెడ్డు కావడంతో అరకొర వసతులతో విద్యార్థినులు ఇబ్బందులకు తదితర సమస్యలతో ఇప్పటికే సుమారు 30 మంది వరకు విద్యార్థినులు టీసీలు తీసుకొని వేరే పాఠశాలలో చేరారు. దీనికి తోడు వేసవి కావడం రేకుల షెడ్డులో తీవ్రమైన ఉక్కపోతతో విద్యార్థినులు సతమతమవుతున్నారు.

అధికారుల ఉదాసీనత

సొంత భవనం ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ. 3.35 కోట్లు మంజూరు చేయగా 2021లో అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదటి రెండేళ్ల నిర్లక్ష్యంతో నిర్మాణం పూర్తి చేయడంలో జాప్యం జరగ్గా.. స్థానిక నాయకులు, విద్యార్థి సంఘాల ఒత్తిడితో గతేడాది డిసెంబర్ నాటికి ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. నిర్మాణం పూర్తయి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇన్నాళ్లు సొంత భవనం లేక ఇబ్బందిపడిన విద్యార్థినులు భవన నిర్మాణం పూర్తయినప్పటికీ తమకు అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉదా సీనతను విడి భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

ఆకతాయి చేష్టలతో విద్యార్థినులు బెంబేలు

రేకుల షెడ్డులో కొనసాగుతున్న కేజీబీవీకి ఆకతాయిల చేష్టలు విసుగు తెప్పిస్తుండడంతో పాటు విద్యార్థినులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది అద్దె భవనంలోకి ఓ ఆకతాయి చొర బడడంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనతో కంగారుపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు సైతం ఇక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రహరీ సరిగా లేకపోవడంతోనే ఆకతాయిలు ఇక్కడ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆకతాయిల చేష్టలతో విద్యార్థినుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను అద్దె భవనంలో ఉంచేందుకు జంకుతున్నారు.

నీటి సరఫరా లేకపోవడంతో ఆలస్యం

కొండమల్లేపల్లి కేజీబీవీ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. కానీ నీటి సరఫరా కాక పోవడంతో ప్రారంభించడంలో ఆలస్యం అవుతుంది. ఉన్నతాధికారులతో ఈ విషయమై ఇప్పటికే వివరించాం. సాధ్యమైనంత త్వరలోనే నీటి వసతి కల్పించి కొండమల్లేపల్లి కేజీబీవీని ప్రారంభిస్తాం.

- నాగేశ్వర్‌రావు, ఎంఈవో, కొండమల్లేపల్లి

మహిళ హక్కుల సాధనే ఐద్వా లక్ష్యం

వేములపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనే లక్ష్యంగా ఐద్వా పనిచేస్తుందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మిఅన్నారు. బుధవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఐద్వా జెండాను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింస, లైంగిక దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నా యని అన్నారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు శీలం పద్మ, మండల కార్యదర్శి అనిరెడ్డి మాధవి, పొదిల లక్ష్మమ్మ, సుకన్య, మల్లమ్మ, సువర్ణ, బాలమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

దేవరకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంతోషి మాత కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు బిజిలి లింగయ్య, యాదగిరి, గోపి, బుడిగ వెంకటేష్, ఎగ్‌బాల్, నర్సింహ పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలను ఎత్తివేయాలి

చింతపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల, వెంకటేశ్వరనగర్‌లో అప్రకటిత విద్యుత్తు కోతలను ఎత్తి వేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడుబాదేపల్లి పులిరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉక్కపోత భరిం చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

దొంగతనాల నివారణకు చర్యలు

● *దేవరకొండ ఏఎస్పీ మౌనిక*

దేవరకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో దొంగతనాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ మౌనిక అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. దేవరకొండ పట్టణంతోపాటు డివిజన్‌లోని మండలాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ డివిజన్‌లో ఇప్పటికే 945 సీసీ కెమెరాలు ఉండగా 725 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయన్నారు. పనిచేయని వాటిని మరమ్మతు చేపడుతామన్నారు. వ్యాపారులు దుకాణాలు, కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దేవరకొండ మీనాక్షి ప్లాజాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోక పోవడమే దొంగలు ఆలస్యంగా దొరకడానికి ఆలస్యమైందన్నారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతిరోజు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

విద్యార్థులు బాగా చదివి పరీక్షలు రాయాలి

హాలియా, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బాగా చదువుకొని పరీక్షలు రాయాలని ఎంఈవో గుండా కృష్ణమూర్తి, ఎన్‌సీఎం ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. బుధవారం అనుముల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 200 మంది పదవ తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 20వేల విలువ చేసే పరీక్ష సామగ్రిని అందజేశారు. అనంతరం ఆంజనేయులు, ఏఈ చంద్రకాంత్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పులిమామిడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాజీద్ అలీ, ఉపాధ్యాయులు, శైలజ, సైదులు, నర్సింహారెడ్డి, చెన్ను వెంకట్‌రెడ్డి, పీడీ వెంకట్‌రాంరెడ్డి, అరవింద్, రవీందర్, నాగేశ్వర్, షాబుద్దీన్, షరీఫ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కేవీ సత్యనారాయణకు ఘన నివాళి

హాలియా, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి రాజకీయ గురువు కేవీ సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని హాలియా ఎస్.ఐ. సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్ అన్నారు. బుధవారం సత్యనారాయణ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లో అపరచాణ క్యుడిగా టీడీపీ ఆవిర్భావంలో రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి ఎన్‌టీఆర్‌కు సలహాలు అందిస్తూ పాలనలో అనేక సంస్కరణలు చేసిన మహానీయుడని వారి సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో నాయకులు మిట్టపల్లి వాసులు, మాజీ కౌన్సిలర్లు పిల్లి ఆంజనేయులు, ప్రసాద్‌నాయక్, అన్నెపాక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, చెరుకూరి కిరణ్‌కుమార్, రామాలయ అధ్యక్షులు మేడేపల్లి మోహన్‌రావు, చెన్నయ్య, అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోటపాటి మధు, శ్రీనుబాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, షైబెల్లి, నగేష్, మధు, సుధాకర్‌రెడ్డి, అంజనేయులు, సురేందర్, కొండల్, జగన్, దుర్గారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా....

● దేవరకొండ : రంజాన్, ఉగాది పండగలను శాంతి యుతంగా జరుపుకోవాలని దేవరకొండ ఆర్డీవో రవ ణారెడ్డి, ఏఎస్పీ మౌనిక అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం జరిగిన శాంతి సంఘం సమావేశంలో వివిద శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మా ట్లాడా రు. పండగల ఏర్పాటుకు అన్ని సౌకర్యాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సంతోష్, కిరణ్, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, వివిద పార్టీ నాయకులు, ఈద్గా కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని నెల్వలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కొణతం సునీతను టీపీ యూఎస్ మహిళ విభాగం మండలాధ్యక్షురాలిగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శికి తన ఎన్నికకు సహకరించినందుకు కృతజ్ఞలు తెలిపారు.

● డిండి, చందంపేట : బీఆర్ఎస్ పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. డిండిలో అరెస్టయినవారిలో పొనుగోటి రవీందర్‌రావు, తండు కవిత చంద్రయ్య ఉన్నారు. చందంపేటలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచుల ఫోరం చందంపేట మండలం మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్, గోసుల శివశంకర్, ముడుదండ్ల ఎంపీటీసీ బాలవర్ధిరాజు, జబ్బు శ్రీశైలం, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● వేములపల్లి : ప్రస్తుత ఉద్యోగ ఫలితాల ను విడుదల చేస్తున్న ప్రతి నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్టల సందీప్ అన్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించగా పోలీస్ స్టేషన్ ఎదుట ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్టల అనిల్, ధైద జాన్సన్, పుట్టల పౌల్, పెదమాం వినోద్, పగడాల చందు, పుట్టల సాయి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు రండి

● మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఆహ్వానించిన కమిటీ



మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్ పూరెలక్ష్మణ్

చింతపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల (వీ.టీనగర్)లో నిర్వహించే వేంకటే శ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు హాజరు కావాలని కోరుతూ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఆల య కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్ ఆహ్వానపత్రిక అందించారు. అలాగే దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 16 నుంచి 22వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

హాలియా, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ పని చేస్తున్నదని క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్లు రేపాల మదన్‌మోహన్, కోడె సతీష్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హాలియా కొత్త కార్యవర్గాన్ని మంగళవా రం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరమళ్ల శ్రీనివాస్, కార్యదర్శిగా సక్రూనాయక్, కోశాధికారిగా రిమ్మలపూడి రామకృష్ణను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రేపాల మదన్‌మోహన్, డయాబెటిక్ కిట్లు, స్పోర్ట్స్ కిట్లు క్లబ్‌కు అందించగా వారు హాలియా జడ్పీ ఉన్నత పాఠశాలకు అందజేశారు. అనంతరం కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చిట్టిపోలు యాదగిరి, మేడేపల్లి మోహన్‌రావు, యడవల్లి నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామదుర్గా రెడ్డి, పేలపూడి బాలకృష్ణ, పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని మండల పరిషత్ అధికారులు

తిరుమలగిరి(సాగర్), మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉదయం 10 గంటల లోపు కార్యాలయాన్ని తెరవాల్సినప్పటికీ బుధవారం సుమారు 10.30గంటల వరకు కార్యాలయానికి తాళాలు వేసి ఉండడం గమనార్హం. ఆ తరువాత హడావుడిగా కార్యాలయాన్ని తెరిచి ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక టీఏ మాత్రమే వచ్చి కూర్చొన్నారు. ఉదయం 10.30 గంటలు దాటినప్పటికి ఎంపీడీవో, ఎంపీవోతో పాటు ఇతర కార్యాలయ అధికారులు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సిబ్బంది హాజరు కాకపోవడంతో ఆఫీసులో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మారుమూల ప్రాంతానికి చెందిన మండలం కావడంతో పాటు జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. నిర్దేశించిన సమయ పాలన పాటించకుండా ఇష్టారీతిన కార్యాలయానికి సిబ్బంది వచ్చి వెళ్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.



ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు